సాక్షి
వికారాబాద్
బుధవారం ¦ 19 ¦ మార్చి ¦ 2025



గడ్డి విత్తనాలకు మంగళం

గడ్డి విత్తనాల సరఫరాలో అంతరాయం కారణంగా పశుపోషణ రైతులకు భారంగా మారుతోంది. 8లో ▸



వన్యప్రాణుల దాహార్తికి..

ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్న తరుణంలో అడవిలో ఊట నీరు వన్యప్రాణుల దాహార్తి తీరుస్తోంది. 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
బుధవారం సా. 6.32 గం.	గురువారం ఉ. 4.59 గం.

న్యూస్‌రీల్

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, పీఎస్ కస్టోడియన్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించరాదని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది మినహా ఇతరులను అనుమతించరాదన్నారు. అలాగే అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ డిపోకు 16 కొత్త బస్సులు

అనంతగిరి: వికారాబాద్ ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం 16 కొత్త బస్సులను కేటాయించింది. మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిందని.. వికారాబాద్ డిపోకు మరిన్ని కొత్త బస్సులు కేటాయించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు 16 కొత్త బస్సులను కేటాయించడం జరిగింది. ఈ బస్సుల రాకతో వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో ప్రయాణం సులభతరమవుతుందని, కొత్త బస్సులు మంజూరు చేసిన మంత్రి పొన్నంకు స్పీకర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

పీఎస్ జేఏసీ జిల్లా చైర్మన్‌గా కిషన్‌రెడ్డి



అనంతగిరి: జిల్లా పంచాయతీ సెక్రటరీస్ జేఏసీ చైర్మన్‌గా బి.కిషన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. మంగళవారం వికారాబాద్‌లో జిల్లా పంచాయతీ సెక్రటరీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కిషన్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా బాల రంగాచారి, మహేశ్వరి, జనరల్ సెక్రటరీగా కృష్ణ, ట్రెజరర్‌గా సత్యనారాయణను ఎన్నుకున్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులను ఏకతాటిపైకి తీసుకువచ్చి జేఏసీ బలోపేతం చేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సీనియర్ కార్యదర్శులు ప్రసన్నకుమార్, రాములు, రాజు, మధుకర్‌రెడ్డి, శ హేందర్ రెడ్డి, రాంచందర్, రామకృష్ణ, రమేష్, రవిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అనంతుడి సేవలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు



అనంతగిరి: బీజేపీ జి ల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మంగళవా రం అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనంతపద్మనాభ స్వామి ఆశీర్వాదంతో ముందుకు సాగుతానని తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఆయన వెంట ధార్మిక సెల్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్ రాఘవేందర్, నాయకులు శివరాజు, గొడుగు సుధాకర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చంద్రమోహన్ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్నతో కలిసి మాట్లాడారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణాల్లో చెత్త సేకరణ సరిగ్గా లేకపోవడం స్థానికులను ఇబ్బంది పెడుతోంది. రోడ్లపైనే మురుగు ప్రవహిస్తుండటంతో జనం నడవలేని పరిస్థితి నెలకొంది. కాలనీల్లో చెత్త పేరుకుపోవడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్యంపై మున్సిపల్ కమిషనర్లు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా తీరని సమస్యలు
- నామమాత్రంగా కంపోస్టు ఎరువుల తయారీ
- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్లు
- ఇబ్బందుల్లో ప్రజలు

మున్సిపాలిటీల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం



వికారాబాద్‌లోని పోస్టాఫీసు సమీపంలోని ఓ కాలనీలో పేరుకుపోయిన చెత్త

వికారాబాద్: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. వార్డుల్లో సేకరించిన చెత్తను పట్టణ శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. కాలనీల్లో చెత్త కుండీలు తీసివేయడం.. రోజూ తిరగాల్సిన చెత్త బండ్లు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ప్రధాన కూడళ్లలో చెత్తను పారబోస్తున్నారు. దీంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. మున్సిపాలిటీలో పరిస్థితి ఇలా ఉంటే అనుబంధ గ్రామాల్లో మరీ అధ్వానంగా ఉంది. ఇంటి, నల్లా పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు కాలనీల్లో కనీస సౌకర్యాలు, వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందడం.. అక్కడే చెత్తను డంపింగ్ చేస్తుంటంతో ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. తడి పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని చెప్పే మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. తడి పొడి చెత్తనంతా కలిపే సేకరిస్తున్నారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 34 వార్డులు.. 70 వేల జనాభా ఉంది. పట్టణంలో రోజుకు సగటున 30 నుంచి 32 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. వికారాబాద్‌లో తడి పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ చేపట్టడం లేదు. కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్ నామమాత్రంగా పని చేస్తోంది. వారానికి 400 కిలోల ఎరువులు కూడా తయారు చేయడం లేదు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఏ వార్డులో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని మార్కెట్, రైతు బజార్ పరిసరాల్లో చెత్త పారబోయడం ఎక్కువగా కనిపిస్తోంది. వికారాబాద్ – అనంతగిరి మార్గంలోని మేకల గండి వద్ద చెత్తను డంప్ చేస్తున్నారు. చెత్త సేకరణ, తరలింపు కోసం రెండు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లు, 17 ఆటోలు వినియోగిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 34 వార్డుల్లో 157 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వికారాబాద్‌ను చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల పక్క.. ఖాళీ స్థలాల్లో..



పరిగి పట్టణంలోని 5వ వార్డులో ఖాళీ స్థలంలో వేసిన చెత్త

పరిగి: పరిగి మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. కొన్ని కాలనీలకు చెత్త సేకరణ వాహనాలు వారంలో రెండు మూడు రోజులే వస్తుండటంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోడ్లపక్క చెత్తను పారబోస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది. పరిగి మున్సిపాలిటీలో 15 వార్డులు, 32,500 జనాభా ఉంది. నిత్యం 14 వాహనాలతో 12 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నా ప్రజలు మాత్రం రెండూ కలిపే వేస్తున్నారు. పరిగి పట్టణంలో చెత్త నిల్వకు డంపింగ్ యార్డు లేకపోవడంతో ప్రైవేటు స్థలాల్లో వేస్తున్నారు. ఇటీవల మున్సిపాలిటీలో ఆరు గ్రామాలు విలీనమయ్యాయి. దీంతో చెత్త సేకరణకు అదనపు వాహనాలు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న వాహనాల ద్వారా చెత్త సేకరణ కష్టంగా ఉంది. రెండో సారి వాహనం రావడం ఆలస్యం అవుతుండటంతో ప్రజలు రోడ్ల పక్క, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను పారబోస్తున్నారు.

చెత్తపై చిత్తశుద్ధి కరువు

తాండూరు: కేంద్ర ప్రభుత్వం ఏటా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించి జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు అందజేస్తోంది. మూడేళ్లుగా కేంద్రం ప్రకటించే జాబితాలో తాండూరు మున్సిపాలిటీ చిట్ట చివరి స్థానంలో నిలవడం గమనార్హం. అంటే పారిశుద్ధ్య నిర్వహణలో ఈ మున్సిపాలిటీ ఏ స్థాయిలో ఉందో చెప్పనవసరం లేదు.తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులు.. 19వేల గృహాలు, 85 వేల జనాభా ఉంది. 254 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. రోజూ 40 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు.ఇందుకోసం 11 ట్రాక్టర్లు, 28 ఆటోలను వినియోగిస్తున్నారు. వీటిలో సగానికి పైగా పని చేయడం లేదు. డంపింగ్ యార్డు నిర్వహణను గాలికొదిలేశారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. కానీ మున్సిపాలిటీలో ఈ విధానం పాటించడం లేదు. నాలుగేళ్లు గా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో చెత్త సేకరణ, డంపింగ్ అధ్వానంగా మారింది. ఇన్‌చార్జ్ అధికారులు ఉన్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. మున్సిపాలిటీలో చెత్త నుంచి ఎరువుల తయారీకి యూనిట్ ఏర్పాటు చేసినా అధికారుల నిర్లక్ష్యంగ కారణంగా ప్రక్రియ ఆగిపోయింది.



తాండూరు మున్సిపల్ కార్యాలయంలో మూలకు చేరిన చెత్త సేకరణ వాహనాలు



మల్కాపూర్ సమీపంలోని నీటికుంట వద్ద ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలో నమోదైన అడవి పిల్లి

చిరుత కాదు.. అడవి పిల్లి

- ట్రాప్ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు
- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- ఊపిరి పీల్చుకున్న కార్మికులు, ప్రజలు



తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులో సంచరిస్తోంది చిరు తపులి కాదని.. అడవి పిల్లి అన్ని అటవీశాఖ అధికారులు తేల్చారు. వారు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో అడవి పిల్లి సంచరిస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. దీంతో కార్మికులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మల్కాపూర్ శివారులోని సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఈ పరిశ్రమకు సంబంధించిన ముడిసరుకు కోసం మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులో 1,392 ఎకరాల్లో నాపరాతి క్వారీ ఉంది. ఇది అటవీ ప్రాంతంలో ఉంది. వారం రోజుల క్రితం క్వారీలో పనిచేసే కార్మికుడికి అడవి జంతువు కనిపించింది. అది చిరుతపులిని పోలినట్లు ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు సోమవారం క్వారీ సమీపంలోని నీటికుంట వద్ద, సంగెంకలాన్ శివారులోని అటవీ ప్రాంతంలో ఐదు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో నీటికుంట వద్దకు అడవిపిల్లి వచ్చింది. ఈ దృశ్యాలు కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ ప్రాంతంలో సంచరిస్తోంది చిరుతపులి కాదని, అడవి పిల్లి అని ప్రజలు, కార్మికులు భయాందోళన చెందరాదని తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి సరస్వతి, ఇన్‌చార్జ్ సెక్షన్ ఆఫీసర్ పిర్యానాయక్ సూచించారు. అడవి పిల్లి వల్ల ఎలాంటి హాని ఉండదని వారు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు డబుల్ సిలిండర్‌తోపాటు ప్రతి నెలా గ్యాస్ బిల్లులు ఇవ్వాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే మే నెలలో పూర్తిగా సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు నర్సమ్మ, భారతి, మంజుల, బేబి, లక్ష్మి, విజయలక్ష్మి, నవనీత, వనజ, సంతోష, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



శశివర్ధన్‌ను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

శభాష్ శశివర్ధన్

- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో సత్తాచాటిన దుద్యాల్ వాసి

దుద్యాల్: తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో దుద్యాల్‌కు చెందిన మాసుల శశివర్ధన్ సత్తాచాటారు. దీంతో తల్లిదండ్రులు చిన్న సాయప్ప, పద్మమ్మ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పేద కుటుంబానికి చెందిన శశివర్ధన్ తల్లిదండ్రులతోపాటు కూలి పనులు చేసుకుంటూ చదివాడు. పలుసార్లు పోటీ పరీక్షలు రాసి ఉద్యోగం కోసం ఎదురు చూశాడు. 2012లో కాంట్రాక్ట్ పద్ధతిన సర్వశిక్షా అభియాన్‌లో సీఆర్‌పీగా ఎంపికయ్యాడు. పదకొండేళ్లపాటు దుద్యాల్‌లో సీఆర్‌పీగా సేవలందిచాడు. ఆ తర్వాత దౌల్తాబాద్ మండలం గోకఫస్లబాద్ పాఠశాలలో రెండేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. సీఆర్‌పీగా పని చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. గతంలో జరిగిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు రాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మంగళవారం దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శశివర్ధన్‌ను గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కమలంలో అసమ్మతి గళం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రకటనపై స్థానిక నేతల కినుక
- రాజశేఖర్‌రెడ్డికి పగ్గాలు అప్పగించడంతో గుర్రు
- అధిష్టానం పునరాలోచించాలని సూచన
- భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ

వికారాబాద్: బీజేపీ జిల్లా కొత్త అధ్యక్షుడి నియామకంపై అసమ్మతి గళం వినిపిస్తోంది. గద్వాలకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డికి అధిష్టానం ఈ బాధ్యతలు కట్టబెట్టిన విషయం తెలిసిందే. వృత్తి రీత్యా వైద్యుడైన ఆయన ప్రస్తుతం వికారాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఏడాది క్రితం పార్టీలో చేరారు. ఆయనతో పాటు జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను నియమించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సపోర్ట్‌తోనే రాజశేఖర్‌రెడ్డిని అధ్యక్ష పదవి వరించినట్లు కొంతమంది సీనియర్లు అంటున్నారు.

చర్చకు తెర..

కొత్త అధ్యక్షుడి నియామకంపై కొంత కాలంగా చర్చ జరుగుతోంది. జిల్లా నుంచి పలువురు సీనియర్లు, జూనియర్లు పోటీ పడగా స్థానికేతరుడైన రాజశేఖర్‌రెడ్డికి పదవి దక్కింది. దీంతో ఆశావహులు అసంతృప్తికి లోనయ్యారు. ఆయన నామినేషన్‌ను తొలగించాలని కొంతమంది సీనియర్లు గత సోమవారం ఉదయం ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఇవేవీ పట్టించుకోకుండా రాజశేఖర్‌రెడ్డికే జిల్లా పగ్గాలు అప్పగించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించాలన్నా కనీసం మూడు సార్లు పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొనడంతో పాటు స్థానికుడై ఉండాలనే నిబంధనను పట్టించుకోలేని స్థానిక నేతలు మండిపడుతున్నారు. మంగళవారం కూడా జిల్లాకు చెందిన కొందరు సీనియర్లు వికారాబాద్‌లో సమావేశమై అసంతృప్తిని వెల్లగక్కడంతోపాటు పాటు భవిష్యత్ కార్యాచరణను చర్చించినట్లు తెలుస్తోంది.

ఆశించి భంగపడిన సీనియర్లు

జిల్లాకు చెందిన పలువురు సీనియర్లు జిల్లా అధ్యక్ష పదవి ఆశించి భంగపడ్డారు. వికారాబాద్‌కు చెందిన పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన వడ్ల నందు, వికారాబాద్‌కు చెందిన కేపీ రాజు, శివరాజు అధ్యక్ష రేసులో ఉంటూ వచ్చారు. వీరితో పాటు తాండూరుకు చెందిన ఉప్పరి రమేశ్, పరిగికి చెందిన రాముయాదవ్ తదితరులు కూడా పదవిని ఆశించారు. వీరందరూ తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని అధిష్టానాన్ని విజ్ఞప్తి చేశారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా రాజశేఖర్‌రెడ్డికి పగ్గాలు అప్పగించడంతో ఆశావహులంతా షాక్‌కు గురయ్యారు.

అదృశ్యమైన విద్యార్థి హాస్టల్‌లో ప్రత్యక్షం

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గిరిజన గురుకులం నుంచి ఈనెల 14న అదృశ్యమైన 9వ తరగతి విద్యార్థి శంకర్ మంగళవారం స్కూల్ ఆవరణలో ప్రత్యక్షమయ్యాడు. విషయం తెలుసుకుని, అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి వివరాలు ఆరా తీసే ప్రయత్నం చేయగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. అతని మానసికస్థితి సరిగా లేద ని భావించిన సిబ్బంది, పోలీసులు.. విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. ఆర్‌సీఓ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ధైర్యం చెప్పారు.



విద్యార్థి శంకర్‌తో ఉపాధ్యాయులు

కడచూపు కోసం.. కన్నీటి పయనం

షాద్‌నగర్: విదేశీ ప్రయాణం అంటే సంతోషంగా ముందుకు సాగుతారు.. అక్కడే స్థిరపడి, జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన పిల్లలు, బంధువులను చూసేందుకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతారు. కానీ రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, పవిత్ర దంపతుల అమెరికా ప్రయాణం కన్నీటిమయమైంది. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తమ కూతురు ప్రగతిరెడ్డి, మనవడు హర్వీన్‌రెడ్డి, వియ్యంకురాలు సునీతారెడ్డిని చివరిసారిగా చూసేందుకు మంగళవారం వారు స్వగ్రామం నుంచి బయల్దేరారు. ఈ నేపథ్యంలో టేకులపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూతురు, మనుమడిని తలచుకుంటూ బాధితులు రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాలను ఇండియా తెప్పించేందుకు వీలు కావడం లేదని, అమెరికాలోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని ప్రగతి అత్తింటి వారి నుంచి సమాచారం రావడంతో బరువెక్కిన హృదయాలతో బయల్దేరారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి దుండగుల కాల్పుల్లో మృతిచెందిన కేశంపేట విద్యార్థి గంప ప్రవీణ్ ఘటనను మరవకముందే.. ఈదుర్ఘటన జరగడం నియోజకవర్గ వాసులను కలవరపెడుతోంది. విదేశాల్లో ఉన్న తమ పిల్లలకు ఫోన్ చేసి జాగ్రత్తలు చెప్పడం కనిపించింది.



పవిత్రను ఓదారుస్తున్న సబితారెడ్డి

పలువురి పరామర్శ

అమెరికాకు పయనమైన మోహన్‌రెడ్డి దంపతులు టేకులపల్లి నుంచి నగరంలోని కొత్తపేటలో ఉన్న తమ నివాసానికి చేరుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వీరిని కలిసి ఓదార్చారు.

క్లుప్తంగా

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది జిలానీ

తాండూరు రూరల్: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాది జిలానీ సూచించారు. మంగళవారం పెద్దేముల్ మండలం గోట్లపల్లి మోడల్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేసి కేసుల పాలైతే ఉద్యోగాలు రావని తెలిపారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్‌కు సంబంధించిన చట్టాలు, శిక్షలను వివరించారు. గొడవలు, అనవసర విషయాలు, వ్యసనాల జోలికి వెళ్లకుండా.. జీవితాలను అందంగా మలచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గాయత్రి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

లెప్రసీపై సర్వే



కాడీడ్‌లో సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో లెప్రసీ(కుష్టు) వ్యాధిపై వైద్యసిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కొడీడ్, సర్సాపూర్ గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు సర్వే చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. వైద్యాధికారిని అమూల్య, సూపర్‌వైజర్ రఫీ సర్వే తీరును పరిశీలించారు. ఈ ఈనెల 30 వరకు అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

పరిగి: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన పట్టణ కేంద్రంలోని 1వ వార్డులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని ప్రేమ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న సుగుణమ్మ పరిగి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. రోజువారీగా పనులకు వెళ్లగా ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చేవరకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.75వేల నగదు కాలి బూడిదయింది.

ఉపాధి కల్పనకు కృషి

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎలిమినేడులో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులకు 68 మంది దరఖాస్తు చేసుకోగా 52 మందిని స్పాట్ సెలక్షన్ చేశారన్నారు. త్వరలోనే మిగిలిన వారికి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ డైరెక్టర్ ఉష, మేనేజర్ భారతి, కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి, సీనియర్ నాయకులు జంగయ్య, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాలకు మంగళం



పశుగ్రాసం కోసం సాగు చేసిన జొన్న పంట

నిలిచిన సరఫరా
- పశుగ్రాసం కోసం తిప్పలు
- కర్ణాటక నుంచి కొనుగోలు చేస్తున్న రైతులు

దౌల్తాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో పశుపోషణ భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతీ సంవత్సరం పంపిణీ చేసే గడ్డి విత్తనాల సరఫరాలో ఈ ఏడాది అంతరాయం ఏర్పడింది. దీంతో మూగజీవాలకు పశుగ్రాసం దొరకడం ఇబ్బందిగా మారింది. మండల పరిధిలో 80శాతం వ్యవసాయం చేసే రైతులకు పశువులున్నాయి. ఈ ఏడాది పశు సంవర్ధక శాఖ ద్వారా అందించే గడ్డి విత్తనాలకు ప్రభుత్వం మొండిచేయి చూపింది.

పశువైద్యశాలలకు చేరని విత్తనాలు

మండల పరిధిలో 33 పంచాయతీలున్నాయి. ప్రతీ సంవత్సరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 75శాతం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేసేవారు. ఇందుకు ప్రత్యేక బడ్జెట్ కెటాయించేవారు. ఈ విత్తనాలు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పశువైద్యశాలలకు చేర్చి అక్కడి నుంచి రైతులకు రాయితీపై అందించేవారు. కానీ ఈ ఏడాది రాయితీ విత్తనాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో పంపిణీ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. యాసంగి ఆరంభంలో పంపిణీ చేసే గడ్డివిత్తనాలు రైతులు వేసవిని దృష్టిలో పెట్టుకుని సాగు చేశారు. తద్వారా గ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకునేవారు. కానీ ఈ సారి ఇప్పటి వరకు కూడా గడ్డి విత్తనాలు పశువైద్యశాలలకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి కొంతమంది రైతులు కర్ణాటక రాష్ట్రంలో చొప్పను కొనుగోలు చేసి తెప్పించుకుంటున్నారు. కొంతమంది రైతుల వద్ద వరిగడ్డిని కొనుగోలు చేసి తరలిస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు

గడ్డి విత్తనాలు ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. జొన్న, మొక్కజొన్న పంటల వైపు దృష్టి సారించారు. తమ పొలంలో బోర్లు వేసి బిందు సేద్యం ద్వారా మొక్కజొన్న, జొన్న పంటలను పండిస్తున్నారు. వర్షాధారిత పంటల రైతులు మాత్రం బయటి నుంచి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై పశువైద్యశాఖ అధికారి సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి గడ్డి విత్తనాల సరఫరా లేదు. రైతులు ప్రతి రోజు వచ్చి అడుగుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం.



వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతులు

బీసీల చిరకాల స్వప్నం సాకారం

- సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లాల్‌కృష్ణ తదితరులు

పరిగి: ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాట నిలబెట్టుకున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టినందుకుగాను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకే సారి రెండు బీసీ బిల్లులను ప్రవేశపెట్టిన ఘటన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లుతో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. బీసీల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి హన్మంతుముదిరాజ్, చిన్న నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, అడ్వకేట్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల చదును: రూ.20 వేల జరిమానా

యాలాల: జేసీబీతో అటవీ భూములను చదను చేయించిన ఇద్దరు వ్యక్తులకు జరిమానా విధించామని ధారూరు అటవీశాఖ రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు. ఈనెల 2న అన్నసాగర్‌కు చెందిన బర్ల హన్మంతు, బర్ల మల్లయ్య రాస్నం గ్రామానికి చెందిన ప్రభాకర్ జేసీబీతో కమాల్‌పూర్ అటవీ భూమిని చదును చేయించారు. సమాచారం అందుకున్న సెక్షన్ అధికారి శంకర్, బీట్ అధికారి కాశన్న, సిబ్బంది శ్రీధర్, యాదగిరి వెళ్లి జేసీబీని సీజ్ చేశారు. అటవీ పరిరక్షణ చట్టం 1967 ప్రకారం కేసు నమోదు చేసి, హన్మంతు, మల్లయ్య నుంచి రూ.20 వేల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. కాగా అన్నసాగర్, కమాల్‌పూర్, పగిడియాల, బాణా పూర్, బాణాపూర్‌తండా, అడాల్‌పూర్, బిజ్జారం పరిధిలో ని ఫారెస్ట్ భూములను చదను చేసినా, ఆక్రమించే ప్రయత్నం చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఆయా గ్రామాల పరిధిలో ఉన్న అసైన్డ్ భూములు సాగులో ఉన్నాయని, కొత్తగా అసైన్డ్ భూములు ఎవరికీ కేటాయించలేదని వివరించారు. ఎవరికనైనా కేటాయిస్తే 18 నెలలలోపు సాగు చేసుకోవాలని, లేదంటే ప్రభుత్వ భూమిగా పరిగణిస్తామని ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్ పేర్కొన్నారు.

వన్యప్రాణుల దాహార్తికి చెక్‌డ్యాం



ధారూరు-గట్టెపల్లి అటవీ ప్రాంతంలో నిర్మించిన చెక్‌డ్యాం

వేసవిలోనూ ఉబికి వస్తోన్న ఊటజలాలు

ధారూరు: మండుటెండల్లో ఊట నీరు వన్యప్రాణుల దాహార్తి తీరుస్తోంది. అడవిలోని జీవజాలం ఊట నీరు తాగుతూ తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. మండల పరిధిలోని ధారూరు-గట్టెపల్లి మధ్య అటవీ శాఖ చెక్‌డ్యాం నిర్మించింది. ఇక్కడ నీటి ప్రవాహం లేకున్నా వేసవిలో ఊట నీరు ఉబికి వస్తోంది. విషయం గమనించిన అటవీశాఖ 2024 డిసెంబర్‌లో రూ.5.58లక్షలు వెచ్చించి దొంగలకుంట అటవీప్రాంతంలో చెక్ డ్యాం నిర్మించారు. ధారూరు ఫారెస్ట్ బీట్‌లో నిర్మించిన ఈ చెక్‌డ్యాంపై నిత్యం నిఘా ఉంటుంది. రాత్రిళ్లు చెక్‌డ్యాం వద్దకు వచ్చే వన్యప్రాణుల వేటకు ఎవరైనా రావచ్చునని పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. చెక్ డ్యాంలో ఎక్కువైన నీటిని కాల్వల ద్వారా పారిస్తున్నారు. మంగళవారం ఈ చెక్‌డ్యాంను ఫారెస్టు రేంజర్ రాజేందర్, డిప్యూటీ ఫారెస్టు రేంజర్ హేమ పరిశీలించారు.

నాగసమందర్‌లో వన్యప్రాణుల వేట



అటవీశాఖ అధికారులు పట్టుకున్న వాహనంలో వలలు, తీగలు

వేటగాళ్ల వాహనం సీజ్

ధారూరు: వన్యప్రాణుల వేటకు వచ్చిన వేటగాళ్ల వాహనాన్ని మంగళవారం ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పట్టుకున్నారు. అధికారుల రాకను గుర్తించిన వేటగాళ్లు వాహనాన్ని వదిలి పారిపోయారు. ధారూరు రేంజర్ బి.రాజేందర్ తెలిపిన ప్రకారం.. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని నాగసమందర్ అటవీప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు. వీరికి అడవిలో ఓ వాహనం కనిపించడంతో అదుపులోకి తీసుకునేందుకు సిబ్బంది ప్రయత్నిస్తుండగా గమనించిన వేటగాళ్లు వారికి దొరక్కుండా పారిపోయారు. ఫారెస్టు రేంజర్ రాజేందర్, సిబ్బంది కేఏ 36 సీ 5587 నంబర్ వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో వన్యప్రాణులను వేటాడేందుకు తాడుతో అల్లిన వలల చుట్టలు, తీగలు లభ్యమయ్యాయి. కోట్‌పల్లి మండల సమీపం అన్నాసాగర్‌కు చెందిన ఓ అనుమానిత వ్యక్తిని ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. అతనితో పాటు వాహనాన్ని ధారూరు అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా ఫారెస్టు అధికారులు పట్టుకున్న వాహనంపై అడవి రాములు అనే అక్షరాలు కనపించాయి.

ఆశ్రమంలో భారీ చోరీ

- ఇంటి దొంగ పనే
- రూ.53 లక్షల నగదు, రూ.5 లక్షల విలువైన వజ్రాలు, రూ.60 లక్షల విలువ చేసే గడియారాలు అపహరణ
- విషయాన్ని గోప్యంగా ఉంచిన పోలీసులు

మొయినాబాద్: ఓ ఆశ్రమంలో భారీ చోరీ చోటు చేసుకుంది. ఈ ఘటనలో రూ.1.18లక్షల విలువ చేసే సొత్తు దోచుకెళ్లారు. చోరీ జరిగి నాలుగు రోజులు దాటినా పోలీసులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. వివరాలు.. మొయినాబాద్ పీఎస్ పరిధిలోని శ్రీరాంనగర్ సమీపంలో శివగిరి ముక్తానంద్ స్వామికి చెందిన శ్రీ మా ఆశ్రమం ఉంది. ఈ నెల 1న స్వామిజీ రిషికేశ్, హిమాలయాలకు వెళ్లారు. ఈ క్రమంలో ఆశ్రమంలో పనిచేసే వ్యక్తులు 15న స్వామిజీ గదిలోకి వెళ్లి చూడగా కిటికీలు, లాకర్లు ధ్వంసమై ఉన్నాయి. ఇదే విషయాన్ని వారు స్వామిజీకి తెలిపారు. లాకర్‌లో ఉన్న రూ.53 లక్షల నగదు, రూ.60 లక్షల విలువైన తొమ్మిది గడియారాలు, రూ.5 లక్షల విలువ చేసే 15 వజ్రాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి స్వామిజీ బెడ్‌రూంలోని బాత్‌రూం కిటికీ నుంచి లోపలికి వెళ్లి లాకర్‌లోని నగదు, వాచీలు, వజ్రాలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆశ్రమంలో పనిచేసే వ్యక్తే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. పోలీసు ఉన్నతాధికారులే విషయాన్ని గోప్యంగా ఉంచాలని చెప్పినట్లు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి చెప్పడం గమనార్హం.

వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల భర్తీ చేపట్టాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అనంతరం నర్సింహా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా ఉద్యోగాలను భర్తీచేస్తే మాదిగలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఎస్సీ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలని కోరారు. మాదిగలకు న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు ఉద్యమాన్ని విరమించేదిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాండు, బాల్‌రాజ్, నాగభూషణం, సురేష్, మహేందర్, శ్రీనివాస్, శివశంకర్, యాదగిరి, చందు, శ్రీను, హరీష్, శ్రీశైలం, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పరిగి: ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. బహార్‌పేట్‌లోని ముబారక్ వెల్డింగ్ షాపు వెనుక పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న అబ్దుల్ అజీజ్, ఖాజా, మౌలాలి, వెంకటేశ్, శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,320 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌కు జైలు

పరిగి: ఆటోను అజాగ్రత్త నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం పరిగి జూనియర్ సివిల్ కోర్టు తీర్పునిచ్చింది. ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. దోమ మండలం కిష్టాపూర్ గ్రామం సామనిగడ్డ తండాకు చెందిన నేనావత్ గోపాల్ ఆటో 2014 ఫిబ్రవరి 2న పరిగి వైపు ప్రయాణిస్తుండగా రూప్‌ఖాన్‌గేట్ సమీపంలో ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా పదిమంది గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఆటో డ్రైవర్‌కు 18 నెలల జైలు శిక్షతో పాటు రూ.6,500 జరిమానా విధిస్తూ పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప తీర్పునిచ్చింది.

ఆటో బోల్తా

పలువురికి గాయాలు

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రం సమీపంలో ఓ ఆటో బోల్తాపడి ప్రయాణికులు గాయపడ్డారు. మంగళవారం ఉదయం జిల్లేడ్ నుంచి చౌదరిగూడ వైపు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చౌదరిగూడ సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భీమమ్మ, చిన్నయ్య, రాజు గాయపడినట్లు సమాచారం. డ్రైవర్ రాజుకు ఫిట్స్ రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గోవులను తరలిస్తున్న వాహనాల అడ్డగింత

చేవెళ్ల: అక్రమంగా తరలిస్తున్న గోవులను చేవెళ్ల భజరంగ్‌దళ్, బీజేవైఎం, హిందూ సంఘాల నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మంగళవారం సర్దార్‌నగర్ నుంచి చేవెళ్ల మీదుగా హైదరాబాద్ మీదుగా తరలిస్తున్న వాహనాలను గుర్తించిన బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గోవులను నార్సింగి పరిధిలోని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్ నాయకులు అనిల్‌కుమార్, సహ ప్రముఖ గణేశ్, ధర్మ రక్షా ప్రముఖ్ రాఘవేంద్రచారి, కావలి శివకుమార్, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ ఠాణాలో కేటీఆర్‌పై కేసు

మొయినాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోలను బీఆర్‌ఎస్ నాయకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారంటూ నాలుగు రోజుల క్రితం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేటీఆర్ సూచనలతోనే బీఆర్‌ఎస్ నాయకులు ఫొటోలు మార్ఫింగ్ చేసి వైరల్ చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ రావు, డి.మచ్చు, కె.యాదగిరి, రవికిరణ్, మురళి, అనిల్, వర్ధన్, అభిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



విద్యార్థుల నృత్య ప్రదర్శన



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

- ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి
- డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- ఘనంగా నంబర్ వన్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

తాండూరు టౌన్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ నంబర్‌వన్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించే దిశగా శ్రమించాలన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగడానికి పేదరికం అడ్డురాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది మహోన్నత స్థితికి ఎదిగారని గుర్తుచేశారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దాత వనజ సహకారంతో విద్యార్థులకు బహుమతులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రత్నమాల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కరీమా బేగం, ప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విలీనం చేసేంతవరకు పోరాటం

మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి



మాట్లాడుతున్న రఘుపతి

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కర్నాటి మనోహర్ కాంప్లెక్స్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ.. మండల పరిధిలోని తుమ్మలూరు, మెహబ్బత్‌నగర్‌లను మాత్రమే ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు మహేశ్వరాన్ని మహానగరంగా మార్చుతామని ఉచిత హామీలిచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి కేవలం రెండు గ్రామాలను విలీనం చేసి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్‌ఆర్‌కు అతి చేరువలో ఉన్న మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయకపోవడం సరికాదన్నారు. త్వరలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను ఐక్యం చేసి ఫ్యూచర్ సిటీలో మండలపరిధిలోని అన్ని గ్రామాలను కలిపేవరకు ఉద్యమిస్తామన్నారు. నియోజకవర్గంలో స్థానికేతలరులను గెలిపిస్తే తమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి కలిసి తమ సమస్యలను విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ కమిటీ సభ్యులు మనోహర్, కడారి జంగయ్య, కాకి ఈశ్వర్, మల్లేశ్ యాదవ్, అంధ్యా నాయక్, నందిగామ నర్సింహ, ఆవుల యాదయ్య, యాదయ్య గౌడ్, యాదగిరి గౌడ్, దత్తు నాయక్, రవికుమార్, రాజు నాయక్, సుదర్శన్ యాదవ్, యాదీష్, కృష్ణా నాయక్, రమేష్, ఆంజనేయులు, శ్రావణ్ పాల్గొన్నారు.

ముసుగు దొంగల హల్‌చల్



బీరువాను ధ్వంసం చేసిన దుండగులు



సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

మూడు గ్రామాల్లో చోరీలు
- నగదు, బైక్ ఎత్తుకెళ్లిన దుండగులు

చేవెళ్ల: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా ముగ్గురు దుండగులు మూడు గ్రామాల్లో హల్‌చల్ చేశారు. మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడి నగదు, ఓ బైక్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని సింగప్పగూడ, రామన్నగూడ, న్యాలట గ్రామాల్లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. సింగప్పగూడలో శేఖర్‌రెడ్డి తన ఇంటికి తాళం వేసి శంషాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి మహేందర్ ఇంటికి తాళం వేసి మరోగదిలో నిద్రించాడు. ఆయన పడుకున్న గదికి గడియ పెట్టి తాళం వేసిన ఇంట్లో రూ.6 వేల నగదు దోచుకెళ్లారు. న్యాలటకు చెందిన కానిస్టేబుల్ అశోక్ తన కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ ఇంట్లో చొరబడిన దొంగలు రూ.10 వేలు దొంగిలించారు. సింగప్పగూడలో రంగారెడ్డి ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌తో పరారవుతుండగా మార్గమధ్యలో రామన్నగూడ వద్ద బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో ద్విచక్రవాహనం నిలిచిపోవడంతో అక్కడే వదిలేశారు. రామన్నగూడ గ్రామంలోకి వెళ్లి అక్కడ గ్రామానికి చెందిన షఫీ ఇంటి ఎదుట పార్కు చేసిన మరోబైక్‌తో పలాయనం చిత్తగించారు.

సీసీ కెమెరాకు చిక్కిన దుండగులు

మూడు గ్రామాల్లో దొంగలు పడినట్లు గుర్తించిన గ్రామస్తులు గ్రామాల్లోని సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించారు. ముగ్గురు దుండగులు ముసుగులు ధరించి చేతిలో కత్తులు, రాడ్‌లు పట్టుకుని వచ్చినట్లు గుర్తించారు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని పక్కింటి వారు లేచి బయటకురాకుండా చుట్టూ ఉన్న ఇళ్లకు గడియలు పెట్టి చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు మూడు గ్రామాల్లో క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసుల దర్యాప్తు చేపట్టారు.